క్లుప్తంగా

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



శృంగవరప్పాడులో ఫిక్స్‌డ్ డిపాజిట్ బుక్ ఇస్తున్న శివకుమార్

సఖినేటిపల్లి: మండలంలోని శృంగవరప్పాడులో ఆదివారం ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన పాటి నరేంద్ర పిల్లలకు శ్రీ నేస్తం సేవా సమితి ఆధ్వర్యాన రూ.30 వేల ఆర్థిక సాయం చేశారు. ఈ మేరకు సమితి సభ్యులు సమకూర్చిన పై మొత్తాన్ని స్థానిక పోస్టాఫీసు కార్యాలయంలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఇందుకు సంబంధించిన డిపాజిట్ పుస్తకాలను రాష్ట్ర నెడ్ క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్ మృతుడి పిల్లలకు అందజేశారు. వైఎస్సార్ సీపీ నేత రావి త్రిమూర్తులు, సేవా సమితి సభ్యులు దొంగ లక్ష్మీనరసింహస్వామి, బొక్కా బాలకృష్ణ, మామిడిశెట్టి శ్రీనివాస్, మల్లుల పాటియ్య, చెల్లుబోయిన రామకృష్ణ పాల్గొన్నారు.

గుడిమెళ్లంకలో..

మలికిపురం: మండలంలోని గుడిమెళ్లంక శివారు టి.సావరానికి చెందిన కడలి రాంబాబు కుమార్తె లక్ష్మీ ప్రసన్నకు వైద్య ఖర్చుల నిమిత్తం గల్ఫ్ యువ నేస్తం సేవా సమితి ఆదివారం రూ.27 వేలు ఆర్థిక సాయం చేసింది. ఈ మేరకు ఈ మొత్తాన్ని ఆమె కుటుంబ సభ్యులకు నెడ్ క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్ అందజేశారు.

మాజీ ఎమ్మెల్యే సేవలు చిరస్మరణీయం



గణేశ్వరరావు విగ్రహానికి పూలమాల వేస్తున్న చైర్మన్ ఆదిత్యకుమార్

మామిడికుదురు: పూర్వపు రాజోలు ద్విసభ్య ఉమ్మడి నియోజకవర్గం అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే నయినాల గణేశ్వరరావు అందించిన సేవలు చిరస్మరణీయమైనవని మామిడికుదురు పీఏసీఎస్ చైర్మన్ కటకంశెట్టి ఆదిత్యకుమార్ ప్రస్తుతించారు. గణేశ్వరరావు వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం మామిడికుదురు సొసైటీ ప్రాంగణంలోని విగ్రహానికి సొసైటీ ఉద్యోగులతో కలసి ఆదిత్యకుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. గణేశ్వరరావు చేసిన సేవలను ఆయన కొనియాడారు. ప్రజాప్రతినిధిగా ప్రజలకు నిస్వార్థంగా సేవలందించి ప్రజల మన్ననలు అందుకున్నారన్నారు. కార్యక్రమంలో సొసైటీ సీఈఓ రొక్కం జనార్దన్‌రెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ తీర్థం

పి.గన్నవరం: మండలంలోని ముంగండ గ్రామంలో వేంచేసిన ముత్యాలమ్మ తల్లి తీర్థం ఆదివారం ఘనంగా జరిగింది. గ్రామస్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. బ్యాండు మేళాలతో అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. వివిధ గ్రామాలకు చెందిన వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా వనువులమ్మ తీర్థం

అయినవిల్లి: మండలంలోని విలసలో కొలువైన వనువులమ్మవారికి ఆదివారం ఘనంగా తీర్థం నిర్వహించారు. రెండు తాడిచెట్లు పాతి అమ్మవారికి ఊయల సేవ చేశారు. అమ్మవారిని గ్రామస్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని కానుకలు, మొక్కులు చెల్లించారు.

యువకుల రక్తదానం



రక్తదానం చేస్తున్న స్వామి వివేకానంద యోగాశ్రమ యువకులు

అమలాపురం టౌన్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రక్తహీనతతో బాధపడుతున్న, రక్తం అత్యవసరమైన 10 మంది గర్భిణుల కోసం అమలాపురం శ్రీస్వామి వివేకానంద యోగాశ్రమానికి చెందిన 9 మంది యువకులు ఆదివారం రక్తదానం చేసి ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడారు. యోగాశ్రమ గురువు డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో యువకులు పి.వెంకట్, ఎం.ప్రవీణ్, ఎస్.శ్రీను, సీహెచ్ నవీన్, కేఎస్‌పీ సురేష్, ఎ.ఆనంద్, బి.ఏసురత్నం, టి.అనిల్, ఎస్.శ్రీనివాసనాయుడులు రక్తదానం చేశారు. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వైద్యులు యువకులను అభినందించారు. రోగులు, వారి కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ

మామిడికుదురు: పి.గన్నవరం నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నగరం గ్రామశాఖ అధ్యక్షుడు కడలి శ్రీనివాస గణపతి ప్రమాదంలో గాయపడ్డారు. అతడు అమలాపురం ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు శ్రీనివాస గణపతిని ఆదివారం పరామర్శించారు. అతని ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్లతో మాట్లాడారు. శ్రీనివాసగణపతికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని చిట్టిబాబు అభిలాషించారు.

సన్‌స్ట్రోక్

రోహిణీ కార్తె వెళ్లింది. మృగశిర కార్తె వచ్చింది ఇక చల్లబడుతుందనుకున్న ప్రజలకు సూరీడు షాక్ ఇస్తున్నాడు. రోహిణీ మీకు వెళ్లిందేమో నాకు కాదు అన్నట్టుగా రోహిణి కార్తెను మించిన ఎండలతో సూరీడు దంచికొడుతున్నాడు. దీనికి తోడు వడగాడ్పుల తీవ్రత కూడా బాగా పెరిగింది. ఉక్కపోత, కరెంట్ కోతలు వెరసి వృద్ధులు, చిన్నపిల్లలు ఎండవేడిమికి తట్టుకోలేక అల్లాడిపోతున్నారు.

- ఉగ్రరూపం దాలుస్తున్న సూరీడు
- పెరుగుతున్న వడగాడ్పులు
- కానరాని రుతుపవనాలు



వడగాల్పులతో నిర్మానుష్యంగా మారిన చింతలూరు సెంటర్

అలమూరు: ప్రచండ భానుడి భగభగలకు ప్రజలు విలవిల్లాడిపోతున్నారు. ఎండ తీవ్రతకు భూమి లోంచి సెగలు రావడంతో వడగాడ్పులు విపరీతంగా వీస్తున్నాయి. తూర్పు నుంచి ఉదయిస్తున్న సూర్య భగవానుడు పశ్చిమ దిక్కున అస్తమించే సరికి వాతావరణాన్ని నిప్పుల కొలిమిగా మార్చేస్తున్నాడు. దీనివల్ల యువకులు వడదెబ్బకు గురి అవుతుండగా వృద్ధులు పిట్టల్లా రాలిపోతున్నారు. ఈ ఏడాది రోహిణి కార్తె పూర్తయి మృగశిర కార్తె వచ్చినా ఎండతీవ్రతలో ఎటువంటి మార్పు రాలేదు. దీని వల్ల ఉదయం నుంచి సాయంకాలం వరకూ ఎండ వేడిమి తగ్గడం లేదు. గ్రామీణ ప్రాంతాలు కూడా కాంక్రీట్ జంగిల్‌గా మారడంతో పాటు గ్లోబల్ వార్మింగ్ వల్ల భూమి త్వరితగతిన వేడెక్కిపోవడం వల్ల అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గ్రామాల్లోని పలు వీధులకు కాంక్రీటు రోడ్లను వేయడంతో ఎండ తీవ్రత ఇళ్లల్లోకి చొరబడుతుంది. దీనికి తోడు వీస్తున్న వడగాడ్పుల వల్ల ఇంట్లోంచి బయటకు వచ్చే పరిస్థితి ప్రజలకు కన్పించడం లేదు. రాత్రి వేళల్లో కూడా ఈ తీవ్రమైన వేడిగాలులు మాత్రం తగ్గడం లేదు. బయట పడుకుందామన్నా దోమల బెడదతో ఇంట్లోనే మగ్గిపోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఎండ తీవ్రతకు అత్యవసర పనులను సైతం వాయిదా వేసుకోవలసిన పరిస్థితి ఏర్పడిందని ప్రజలు వాపోతున్నారు. ఉష్ణోగ్రతలు మరిన్ని రోజుల పాటు ఇలాగే కొనసాగుతాయని వాతావరణ శాఖ తేల్చి చెప్పడంతో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నైరుతి రుతుపవనాలు ఈనెల మూడో వారంలో ప్రవేశించే అవకాశం ఉన్నందున అప్పటి వరకూ ఈ పరిస్థితి తప్పదని ప్రజలు నిట్టూరుస్తున్నారు. వాతావరణంలో సంభవించిన మార్పుల వల్ల ఉష్ణోగ్రతలు పెరిగి వడగాడ్పులతో కూడిన ఉక్కపోత ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

జీవనోపాధిపై పెను ప్రభావం

ఉష్ణోగ్రతలు ఉగ్రరూపం దాల్చడంతో వీస్తున్న వడగాడ్పులు ప్రజల జీవనోపాధిపై పెను ప్రభావం చూపుతున్నాయి. తినుబండార, ఐస్ క్రీమ్ తదితర వ్యాపారాలు సాగించే చిరు వ్యాపారులు తమ కార్యకలాపాలను నిలిపివేయడంతో జీవనోపాధికి తీవ్ర విఘాతం ఏర్పడుతుంది. వ్యవసాయ కూలీలు పొలం వెళ్లి పనులు చేసుకునేందుకు అవకాశం ఉండటం లేదు. అనునిత్యం రద్దీగా ఉండే పలు కూడళ్లు నిర్మానుష్యంగా ఉండటంతో వ్యాపారాలు వెలవెలబోతున్నాయి. కార్మికులు తమ విధులకు హాజరయ్యేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ కోతల వల్ల శీతల పానీయాలు సైతం తాగేందుకు వీలు లేకుండా పోతుంది. ఎండ తీవ్రత వల్ల వడగాడ్పులకు లోను కావడంతో అనేక మంది అనారోగ్యం బారిన పడుతున్నారు.

ఇంటి పెరట్లో 12 రకాల ఫల రకాల సాగు

ఆదర్శంగా నిలుస్తున్న రైతు బులి నాగేశ్వరరావు



ఇంటి పెరట్లో విరగ కాసిన నారింజ చెట్టు

మామిడికుదురు: ఇంటి పెరట్లో 12 రకాల ఫల రకాలు సాగు చేస్తూ ఔరా అనిపిస్తున్నాడు పాశర్లపూడిలంకకు చెందిన రైతు తెలగారెడ్డి బులినాగేశ్వరరావు. ఎటువంటి రసాయన ఎరువులు వాడకుండా కేవలం కంపోస్టు ఎరువులనే మొక్కలకు వేసి వాటిని పెంచుతున్న తీరు అబ్బుర పరుస్తోంది. బంగినపల్లితో పాటు రసాలు మామిడిచెట్లు, వాటికి విరగా కాసిన కాయలు చూపరులను మంత్ర ముగ్ధుల్ని చేస్తున్నాయి. వడ్లమూడి నారింజ, సపోటా, రెండు రకాల వాటర్ యాపిల్స్, రేగి, జామ, బొప్పాయి, సీతాఫలం, అల్ల నేరేడు, దానిమ్మ ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో రకాల ఫలాల మొక్కలను నాగేశ్వరరావు ఇంటి పెరట్లో పెంచుతున్న తీరు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. కేవలం పది సెంట్ల విస్తీర్ణంలో అతను ఇల్లు కట్టుకున్నాడు. ఇంటి చుట్టూ ఉన్న స్థలంలో పలు రకాల ఫల రకాలు మొక్కలు పెంచాడు. అయిదేళ్ల క్రితం నాటిన మొక్కలు ఇప్పుడు కాపుకు వచ్చాయని బులినాగేశ్వరరావు చెప్పారు. ఫల రకాలు సాగు చేయడం అంటే తనకు చిన్నప్పటి నుంచి ఎంతో ఇష్టమని ఆయన పేర్కొన్నాడు. ఆ ఇష్టంతో పెంచిన మొక్కలు పెరిగి పెద్దయ్యాయని, ప్రస్తుతం అవి కాపుకు వచ్చాయన్నాడు. పలు రకాల చెట్లు పెంచుతున్న నాగేశ్వరరావు ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ ద్వారా పేదలకు భరోసా



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా సీఎం జగన్ పేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఐదు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను ఆదివారం ఎమ్మెల్యే చిట్టిబాబు తన క్యాంపు కార్యాలయం వద్ద అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ ద్వారా నిరుపేదలకు ఉచితంగా వైద్యం చేయించడంతో పాటు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందజేస్తున్నామని చెప్పారు. పేదలకు అండగా నిలవడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో అప్పనపల్లి దేవస్థానం చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, మండల జేసీఎస్ కన్వీనర్ జక్కంపూడి వాసు, పార్టీ నేతలు యూవీవీ సత్యనారాయణ, చిక్కం బుజ్జిబాబు, పిల్లి శ్రీనివాస్, కుసుమ శ్రీనివాస్, కొండేటి వెంకటేశ్వరరావు, అన్వర్ తాహిర్ హుస్సేన్, పాలమూరి గోపాల్, తవిటికి వెంకటేశ్వరరావు, వానరాశి బుజ్జి పాల్గొన్నారు.

నేదునూరులో ఉచిత వైద్య శిబిరం

అయినవిల్లి: నేదునూరులో రావి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విజయ ఆర్థోపెడిక్ ఆస్పత్రి నేతృత్వంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యులు టీబీ వెంకటేష్ రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో రావి ఫౌండేషన్ కార్యదర్శి పాలగుమ్మి వెంకటకృష్ణ, కొయ్యపు రామకృష్ణ, గ్రామ సర్పంచ్ గుమ్మడి ప్రసాద్, ఎంపీటీసీలు ఇందుగుల వెంకట్రామయ్య, కళ్లేపల్లి సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు జేవీకే కిట్ల పంపిణీ

అలమూరు: మండలంలోని చెముడులంకలో సోమవారం జగనన్న విద్యాకానుక (జేవీకే) కిట్ల పంపిణీ జరుగుతుందని గ్రామ సర్పంచ్ తమ్మన శ్రీనివాసు తెలిపారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని సూచించారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

పి.గన్నవరం: ముంగండలోని మంత్రవాది ఇందిరా కుమారి స్మారక గ్రామీణ వైద్యాలయంలో మంగళవారం ఉదయం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు హోమియో వైద్యుడు ఖండవిల్లి నాగేశ్వరరావు తెలిపారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆస్పత్రి వైద్యులు కంటి పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తారని తెలిపారు. పరిసర గ్రామాల ప్రజలు కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

నియోజకవర్గ బీజేపీ కార్యకర్తల సమావేశం

మలికిపురం: రాజోలు నియోజకవర్గ బీజేపీ కార్యకర్తల సమావేశం ఆదివారం స్థానిక పార్టీ నేత అచ్యుత్ రామరాజు ఇంటి వద్ద మరో నేత అడబాల రాంబాబు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీ వేమా, జిల్లా ప్రధాన కార్యదర్శి అడబాల సత్యనారాయణ మాట్లాడుతూ, ప్రధాని మోదీ ప్రభుత్వానికి 9 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 20వ తేదీ నుంచి జూలై ఒకటో తేదీ రకూ గ్రామ గ్రామాన ప్రజలందరికీ కేంద్రం ప్రవేశపెట్టిన పథకాలపై రూపొందించిన కరపత్రాలను అందజేయాలన్నారు. అలాగే వివిధ సంక్షేమ పథకాలు గురించి వివరించాలని సూచించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, జిల్లా కార్యవర్గ మెంబర్ కె.నాగేశ్వరరావు, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు చెల్లింగి త్రినాథ్, మండల అధ్యక్షుడు చెంపాటి శివ రామకృష్ణంరాజు, నక్కా త్రిలోచనరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

రామచంద్రపురం: నూతనంగా ఏర్పాటైన చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం కార్యక్రమం మంగళవారం నిర్వహిస్తున్నట్టు ఉపాధ్యక్షులు కంచుమర్తి బాబూరావు వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం కార్యవర్గ సభ్యులతో కలిసి ఆయన పట్టణంలోని కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. బాబూరావు మాట్లాడుతూ 2023–25 సంవత్సరాలకు గాను పట్టణంలోని వ్యాపార, వాణిజ్య సంస్థలకు చెందిన వారు నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారన్నారు. ఈనెల 13న స్థానిక లయన్స్ కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్టు వెల్లడించారు. రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణు, మున్సిపల్ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి శ్రీధర్ ముఖ్య అతిథిలుగా హాజరవుతారన్నారు.

నూతన కార్యవర్గం

గౌరవాధ్యక్షులుగా అడ్డూరి జగన్నాథవర్మ, నల్లమిల్లి జనార్దనరెడ్డి(చంటిరెడ్డి), అధ్యక్షులుగా కొవ్వూరి తాతారెడ్డి, ఉపాధ్యక్షులుగా కంచుమర్తి బాబూరావు, కార్యదర్శిగా పసుపులేటి వీరవెంకట సత్యనారాయణమూర్తి (సత్తిబాబు), సహాయ కార్యదర్శిగా శిరిగినీడి దుర్గాప్రసాద్, కోశాధికారిగా మాదాల శ్రీలక్ష్మీనారాయణ, కార్యవర్గ సభ్యులుగా కొండపల్లి వీరరాఘవులు, కొమరి సురేష్, కర్రి శివారెడ్డి, గ్రంధి నూకరాజు తదితరులు ఎన్నికయ్యారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరాలు



ఈదరాడలో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న హెచ్‌ఎం సాయిబాబు



పి.గన్నవరంలో విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న శివాజీ

మామిడికుదురు: గ్రంథాలయాల ద్వారా పాఠకులకు ఎంతో విలువైన సమాచారం లభిస్తోందని ఈదరాడ జెడ్పీహెచ్ స్కూల్ హెచ్‌ఎం జి.సాయిబాబు పేర్కొన్నారు. మామిడికుదురు శాఖా గ్రంథాలయంలో నెల రోజుల పాటు జరిగిన వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు సమావేశం ఆదివారం గ్రంథాలయాధికారి ఏకేవీఆర్ సూర్యనారాయణ అధ్యక్షతన జరిగింది. సాయిబాబు మాట్లాడుతూ గ్రంథాలయాల్లో పాఠకులు కోరుకునే ఎంతో విలువైన సమాచారం అందుబాటులో ఉంటుందన్నారు. ఈ సేవలను పాఠకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు ఎం.శ్రీరామచంద్రమూర్తి, కుసుమ జయప్రసాద్, ఈదరాడ బీడీసీ నిర్వాహకుడు యెరుబండి కన్నబాబు పాల్గొన్నారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని, విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని విశ్రాంత మున్సిపల్ కమిషనర్ నల్లి శివాజీ అన్నారు. పి.గన్నవరంలోని శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ జి.రవికుమార్ ఆధ్వర్యంలో 8వ తేదీ నుంచి విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయి. పాటలు, వ్యాసరచన, చిత్రలేఖనం, స్పోకెన్ ఇంగ్లిషు తదితర అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లను శివాజీ అందజేశారు. విశ్రాంత హెచ్‌ఎం సాకా సత్యం, సీతామహాలక్ష్మి, బీఎస్‌ఎన్ సత్యనారాయణ పాల్గొన్నారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: గ్రంథాలయాల ద్వారా బహుళ ప్రయోజనాలు ఉన్నాయని అంబాజీపేట జెడ్పీహెచ్ స్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు నందిక వెంకటేశ్వరరావు చెప్పారు. అంబాజీపేట గ్రంథాలయంలో ఆదివారం వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు సమావేశం గ్రంథాలయాధికారి జి.శ్రీనివాసు అధ్యక్షతన జరిగింది. విజ్ఞాన శిబిరంలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు. సచివాలయ కార్యదర్శి అంబటి అశోక్‌కుమార్, విశ్రాంత ఉద్యోగి మట్టపర్తి వీవీ సత్యనారాయణ, రిసోర్స్ పర్సన్ ఎస్.వీర్రాజు, యర్రంశెట్టి పాండురంగారావు పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తినిచ్చే సామరస్య భవిష్యత్ కావాలి



అమలాపురం ఓం శాంతి పీస్ మార్చ్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ శ్రీధర్

అమలాపురం టౌన్: యువతకు స్ఫూర్తినిచ్చే శాంతి స్థాపన, సామరస్య భవిష్యత్ కావాలని జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ పిలుపునిచ్చారు. ప్రజాపిత బ్రహ్మా కుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం అమలాపురం ఓం శాంతి కేంద్రం ఆధ్వర్యంలో అమలాపురంలో ఆదివారం ఉదయం జరిగిన బ్రహ్మకుమారీస్ వై 20 పీస్ మార్చ్‌ను స్థానిక ఎస్‌కేబీఆర్ కళాశాల వద్ద 216 జాతీయ రహదారిపై ఎస్పీ శ్రీధర్ జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. ర్యాలీ ఎస్‌కేబీఆర్ కళాశాల నుంచి సుబ్బారాయుడు చెరువు, హైస్కూలు సెంటరు, గడియారం స్తంభం సెంటరు, ముమ్మిడివరం గేటు సెంటరు మీదుగా గరిగుంట చెరువు వద్ద నూతనంగా నిర్మించిన నూతన ఓం శాంతి కేంద్ర భవనం వరకూ సాగింది. బ్రహ్మ కుమారీస్ కేంద్ర యూనియన్ మినిస్ట్రీ ఆఫ్ యూత్ అండ్ స్పోర్ట్స్ సంయుక్తంగా దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న వై 20 సిరీస్ కార్యక్రమంలో భాగంగా అమలాపురంలో పీస్ మార్చ్ ఏర్పాటుచేసినట్లు ఓం శాంతి కేంద్ర ప్రతినిధి బీకే స్వరూప తెలిపారు. శాంతి ర్యాలీలో మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, పి.గన్నవరం పోలీసు సర్కిల్ సీఐ డి.ప్రశాంత్‌కుమార్, కిమ్స్ నర్సింగ్ కళాశాల, బీవీసీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు, బాస్కెట్ బాల్ క్రీడాకారులు, ఎన్‌సీసీ క్యాండెట్లు పాల్గొని శాంతి నినాదాలు చేశారు.

గర్భిణుల సేవలో..


- కిల్కారీ మొబైల్ అకాడమీ
- టోల్ ఫ్రీ నంబర్‌తో గర్భిణుల మొబైల్స్ అనుసంధానం
- రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల సమన్వయంతో నిర్వహణ



సదస్సులో మాట్లాడుతున్న ఏఎన్‌ఎం, పాల్గొన్న వైద్యులు

మలికిపురం: వైద్య రంగంలో మరో ముందడుగు పడింది. గ్రామీణ ప్రాంతాలలో గర్భిణులకు, బాలింతలకు ప్రత్యేక వైద్యసేవలు అందుతున్నాయి. ఇందు కోసం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల సమన్వయంతో ప్రత్యేక విభాగం ఏర్పడింది. కిల్కారీ మొబైల్ అకాడమీ పేరుతో ఏర్పడిన ప్రత్యేక విభాగం గ్రామీణ గర్భిణుల పాలిట వరంగా మారింది. గత జనవరిలో ఏర్పాటైన విభాగం ప్రస్తుతం పూర్తి స్థాయిలో ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. ఈ విభాగం సేవలను ప్రజలు మరింతగా వినియోగించుకునేందుకు అకాడమీ సిబ్బంది నేరుగా రంగంలోకి దిగారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలో ప్రత్యేక అవగాహన తరగతులు నిర్వహించి కిల్కారీ మొబైల్ అకాడమీ సేవలు పూర్తి స్థాయిలో ప్రజలకు చేరేందుకు కృషి చేస్తున్నారు. ప్రతి పీహెచ్‌సీ పరిధిలో ప్రతి నెలలో సగటున 300 మంది చొప్పున గర్భిణులు ప్రభుత్వం ద్వారా వైద్య సేవలు పొందుతున్నారు. స్థానిక పీహెచ్‌సీల పరిధిలో ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్ల ద్వారా గర్భిణి ఫోన్ నంబర్ల నుంచి ఆకాడమీ టోల్ ఫ్రీ నెంబర్‌కు మిస్డ్ కాల్ చేస్తారు. అప్పటి నుంచి అకాడమీలో సదరు గర్భిణి ఫోన్ నంబరు రిజిస్టర్ అవుతుంది. ఆ పై నుంచి ప్రతి వారం రెండు సార్లు చొప్పున అకాడమీ నుంచి ప్రత్యేక వైద్యులు నేరుగా గర్భిణికి ఫోన్ చేస్తారు. ఆ వారంలో అవసరమైన వైద్య సలహాలు, ఆహార ఆరోగ్య నియమాలు, మందుల వాడకంపై సలహాలు సూచనలు ఇస్తారు. మందులను స్థానిక పీహెచ్‌సీల ద్వారా, పౌష్టికాహారం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తారు. లక్కవరం పీహెచ్‌సీ వద్ద శుక్రవారం కిల్కారీ మొబైల్ అకాడమీ సేవలను ప్రాజెక్టు రాష్ట్ర మేనేజర్ రాజు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించి ఏఎన్‌ఎంలకు, ఆశాల వర్కర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. గ్రామాలలో గర్భిణులకు అవగాహక కల్పించి ఫోన్ నంబర్లను రిజిస్ట్రేషన్ చేయాలని సూచించారు. పీహెచ్‌సీ వైద్యులు ఎస్.క్రాంతి కుమార్ ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు ఎంతో మేలు



ప్రభుత్వం నిర్వహిస్తున్న కిల్కారీ మొబైల్ అకాడమీ సేవలు బాలింతలు, గర్భిణులకు చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. గర్భిణి గర్భం ధరించిన సమయంలో 72 సార్లు ఫోన్ వెళ్తుంది. సందేహాలు నివృత్తితో పాటు ఆహార నియమాలు, ఆరోగ్య సలహాలు అందుతాయి.

– రాజు, మేనేజర్, కిల్కారీ మొబైల్ అకాడమీ

ముగిసిన తైక్వాండో ఉచిత శిక్షణ శిబిరం



క్రీడాకారులకు సర్టిఫికెట్లు, బ్లాక్ బెల్ట్‌లు అందజేసిన ఎస్సై చైతన్యకుమార్

అంబాజీపేట: అంబాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో గత 30 రోజులుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తైక్వాండో వేసవి ఉచిత శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసినట్టు తైక్వాండో సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు తెలిపారు. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అంబాజీపేట ఎస్సై ఎ.చైతన్యకుమార్ వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న 84 మంది క్రీడాకారులకు సర్టిఫికెట్లు, 17 మంది తైక్వాండో క్రీడాకారులకు బ్లాక్ బెల్ట్‌లను అందజేశారు. చైతన్యకుమార్ మాట్లాడుతూ తైక్వాండో వంటి యుద్ధ క్రీడలు నేర్చుకోవడం వలన శారీరక దృఢత్వంతో పాటు మానసిక ధైర్యం పెంపొందుతుందన్నారు. క్రీడలను నిరంతరం సాధన చేయడం ద్వారా రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలకు వెళ్లే అర్హత సాధిస్తారన్నారు. క్రీడలతో పాటు విద్యపై ప్రత్యేక ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి వెళ్లాలన్నారు. అనంతరం స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఎస్సై చైతన్యకుమార్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పీడీ కె.ఆదిలక్ష్మి, ఆశ్వా కమిటీ చైర్మన్ కామిశెట్టి మధుబాబు, ఎం.నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.

శిథిల స్థితిలో శివమ్‌బాత్



రాజీవ్ బీచ్ వద్ద శివమ్ బాత్



విరిగిపోయిన ఏనుగు విగ్రహ కాలు, దంతం

యానాం: గౌతమీగోదావరి తీరానికి పర్యాటకులను ఆకట్టుకునేలా రెండు వైపులా భారీ గజరాజు విగ్రహాలు, మధ్యలో శివలింగం అభిషేకం చేస్తున్నట్లుగా నిర్మించిన శివమ్‌బాత్ శిథిల స్థితికి చేరుకుంటుంది. బీచ్‌కు వచ్చేవాళ్లు రాజీవ్‌బీచ్‌కే హైలెట్‌గా నిలిచే శివమ్‌బాత్ వద్ద జల్లు స్నానం చేసి అనంతరం ఇక్కడే ఫొటోలకు ఫోజులిచ్చి వెళ్లడం ఆనవాయితీగా వస్తుంది. అయితే శివమ్‌బాత్ ఏనుగు బొమ్మల తొండం, దంతం కాలు తదితరమైన భాగాలు శిథిలమై విరిగి వేలాడుతున్నాయి. వీటి పరిస్థితిపై పలువురు స్థానికులు పీడబ్ల్యూడీ అధికారులకు ఫిర్యాదు చేసినా వాటి గురించి పట్టించుకోవడం లేదు.

గతంలో మరమ్మతులు చేయించినా అదీ తూతూ మంత్రంగా చేపట్టడంతో మళ్లీ యథాస్థితికి చేరుకున్నాయని స్థానికులు విమర్శిస్తున్నారు. దీనికి తోడు జల్లు స్నానఘట్టంకు సంబంధించిన పైపులు పనిచేయకపోవడంతో జల్లు స్నానం లేక పర్యాటకులు నిరాశగా వెనుదిరుగుతున్నారు. తక్షణం అధికారులు స్పందించి శివమ్‌బాత్‌ను పరిరక్షించాలని యానాంవాసులు కోరుతున్నారు.